www.aryadvi.com
తెలుగు దినపత్రిక
News Daily
# ఆర్యాద్వి
అక్షర సత్యం - ప్రజా సాక్ష్యం
సోమవారం
19-10-2026
సంపుటి (VOLUME): 1 సంచిక (ISSUE): 1
పేజీలు : 8
వెల : 1/-
Simultaneously Published from: Hyderabad | Vijayawada | Visakhapatnam




మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



# ఒక్క ఉద్యోగం లేదు,
## కోట్లాది రూపాయలు వసూలు
## టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్

- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ
- బాధితులకు నష్టపరిహారం ఇచ్చి, సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్
- టోమ్‌కామ్ ఫీజులు, ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70–75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో

- మిగతా 2లో



# తెలంగాణలో సద్దుల బతుకమ్మ సంబురాలు

- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు
- మహా బతుకమ్మ ర్యాలీలో 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు
- వేడుకల్లో పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క
- విజయ్ దేవరకొండ--రష్మిక దంపతుల సందడి
- ఫైర్‌వర్క్స్, లేజర్ షో ప్రత్యేక ఆకర్షణ
- మెదక్, ఆదిలాబాద్, వరంగల్ సహా పలు జిల్లాల్లో ఘనంగా వేడుకలు

తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ ) సంబురాలు ఘనంగా సాగుతున్నాయి. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ట్యాంక్ బండ్‌పై ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, సినీనటుడు విజయ్ దేవరకొండ-రష్మిక దంపతులు పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ వేడుకల్లో ఫైర్‌వర్క్స్, లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మెదక్, ఆదిలాబాద్, జనగామ, నిజామాబాద్, వరంగల్ తదితర చోట్ల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో ఊరూవాడా పూలవనంగా మారింది. బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు, చిన్నారులు ఆడిపాడారు.



## సొంతూళ్లకు హైదరాబాద్ వాసులు..
# చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ వద్ద వాహనాల రద్దీ నెలకొంది. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను స్వస్థలాల్లో చేసుకునేందుకు హైదరాబాద్ వాసులు బయల్దేరారు. దీంతో హైవేపై వాహనాల రద్దీ ఏర్పడింది. చౌటుప్పల్ పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తుండడంతో వాహనాలను ఇరుకుగా ఉండే సర్వీస్ రోడ్డుపైకి మళ్లించారు. సాధారణం కంటే రెట్టింపుగా వస్తున్న వాహనాలు సర్వీస్ రోడ్డులో నెమ్మదిగా కదులుతున్నాయి. స్థానికులు జాతీయ రహదారిని ఈ వాహనాల మధ్య నుంచే దాటాల్సి వస్తోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.



## గునీటి వృథా.. హైదరాబాద్‌లో పబ్‌కు రూ.20వేల జరిమానా

- తాగునీటి దుర్వినియోగంపై జలమండలి కఠిన చర్యలు
- జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై చర్యలు
- పబ్ వాటర్ కనెక్షన్‌ను తొలగించి, ట్యాంకర్ల సరఫరా నిలిపివేత
- నీటి వృథాపై ఫిర్యాదు చేయాలని ప్రజలకు జలమండలి పిలుపు

2లో

### ఎల్ నినో కాలంలో ప్రతి ఒక్కరు పొదుపు పాటించండి...
## ప్రభుత్వానికి సహకరించండి
### మంత్రి వివేక్ వెంకటస్వామి

ఎల్ నినో కాలంలో ప్రతి ఒక్కరు నీటిని, కరెంటును పొదుపుగా వాడాలని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఆదివారం ( అక్టోబర్ 18 ) మంత్రి వివేక్ నివాసంలో మందమర్రి పట్టాన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఓలతో సమావేశం నిర్వహించిన సందర్భంగా మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎల్ నినో ప్రభావం తో

- మిగతా 2లో






## ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు..
## 143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు

- ఫ్రాన్స్‌లో హింసాత్మకంగా మారిన జీవన వ్యయ నిరసనలు
- 143 ఏళ్ల నాటి లిమోజెస్ టౌన్ హాల్ భవనాన్ని దగ్ధం చేసిన ఆందోళనకారులు
- దేశవ్యాప్తంగా 1200 మంది అరెస్ట్, 150 మంది పోలీసులకు గాయాలు
- వలస విధానాలే హింసకు కారణమంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య
- హింసకు తావులేదంటూ ఖండించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్

- మిగతా 2లో



## బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా కాల్పులు

:బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ వాహనంపై కాల్పులు జరిగాయి. ఆదివారం సాయంత్రం ఆయన ముంబయిలోని జుహు ప్రాంతంలో కారులో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి తెగబడ్డారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు

- మిగతా 2లో

## వలసలే ఫ్రాన్స్‌లో అల్లర్లకు కారణం..
## తక్షణమే బోర్డర్స్ క్లోజ్ చేయండి



ఫ్రాన్స్‌లో తీవ్రరూపం దాల్చిన అల్లర్లపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నిరసనలు, అల్లర్లకు అనియంత్రిత వలసలే కారణమని పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి ఫ్రాన్స్‌కు వచ్చిన వలసదారులు తమ హృదయాల్లో ద్వేషాన్ని నింపుకుని ఒకప్పుడు ఎంతో గొప్పగా ఉన్న దేశాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఫ్రాన్స్ తక్షణమే తన సరిహద్దులను మూసివేసి వలసలను అదుపు చేయాలని సూచించారు.

- మిగతా 2లో

## విదేశీ సంస్థలకు రహస్య సమాచారం..
## పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి భార్య



- మిగతా 2లో

## రష్యాపైకి 1,000కిపైగా డ్రోన్లు..
## మంటల్లో ఇంధన టెర్మినల్

రష్యాపై ఉక్రెయిన్ భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకకాలంలో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇది ఒకటి. ఈ డ్రోన్ల దాడిలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఓ ఇంధన టెర్మినల్

- మిగతా 2లో





## భారత్ విషయంలో ఆ రోజు హద్దులు దాటి మాట్లాడాను

- మిగతా 2లో

## వలసలే ఫ్రాన్స్‌లో అల్లర్లకు కారణం.. తక్షణమే బోర్డర్స్ క్లోజ్ చేయండి

- మొదటి పేజి తరువాయి

విద్యార్థుల ఆందోళనతో మొదలై.. దేశవ్యాప్త ఉద్యమంగానిరసనలు, అల్లర్లతో ఫ్రాన్స్ అట్టుడికిపోతుంది. దేశంలో నిత్యవసరాల పెరుగుదల, పాఠశాలల్లో పరిస్థితులు దిగజారడం, విద్యా సదుపాయాల కొరత వంటి సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. ఒక ప్రాంతంలో ప్రారంభమైన నిరసనలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించాయి. జీవన వ్యయాలు పెరగడం, ప్రజా సేవల నాణ్యత తగ్గడం, ఆర్థిక ఇబ్బందులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదన్న అసంతృప్తితో కార్మిక సంఘాలు, ఇతర వర్గాలు కూడా ఉద్యమంలో చేరాయి.పారిస్?లో ప్రధాన ర్యాలీ ప్రశాంతంగానే సాగింది. కానీ పలుచోట్ల నిరసనకారులు ఆగ్రహానికి గురికావడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. నిరసనకారులు వీధుల్లో నిప్పు పెట్టడంతో పాటు వాహనాలను, ప్రభుత్వ భవనాలను తగులబెట్టారు. ప్రముఖ ప్రాంతమైన ప్లాస్ ద లా రిపబ్లిక్ సమీపంలోనూ వాహనాలకు నిప్పంటించారు. అనంతరం పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ద

పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను ప్రయోగించారు. పోలీసులు నిరసనకారులపైకి దూసుకెళ్లి లాఠీలతో కొడుతున్న దృశ్యాలు కూడా వెలుగులోకి వచ్చాయి.

**నిరసనలకు కారణం వలసలు కాదు**

ఫ్రాన్స్?లో అంతర్గత నిరసలు, అల్లర్లకు వలసలే కారణమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పదే పదే చెబుతున్నారు. కానీ అల్లర్లపై ఫ్రాన్స్ ప్రభుత్వం, నిరసనకారుల వాదన మరోలా ఉంది. దేశంలో అల్లర్లకు వలసలు కారణం కాదని.. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, ఆర్థిక ఇబ్బందులు, నిత్యవసరాల పెరుగుదలే కారణమని ప్రభుత్వం, నిరసనకారులు చెబుతున్నారు. దేశంలో ప్రస్తుతం జరుగుతోన్న నిరసనలకు వలసలతో లేదా మరే ఇతర మతపరమైన అంశాలతో సంబంధం లేదని ఫ్రాన్స్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## విదేశీ సంస్థలకు రహస్య సమాచారం.. పోలీసుల అదుపులో ఆర్మీఅధికారి భార్య

ఇంటర్నెట్ డెస్క్: విదేశీ గూఢచర్య సంస్థలకు దేశ రక్షణకు సంబంధించిన సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలతో.. ఆర్మీ అధికారి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపే సున్నితమైన పత్రాలు, ఫోటోలు, ఎలక్ట్రానిక్ డేటాను రహస్యంగా సేకరించడం, బదిలీ చేయడం వంటి విషయాల్లో విదేశీ ఏజెంట్లకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం అందినట్లు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం..పరిశోధన సంబంధిత కార్యకలాపాలను ఆర్మీ అధికారి పర్యవేక్షించేవారు. ఆయన భార్యకు కొన్ని నెలల క్రితం.. సోషల్ మీడియాలో పలువురు వ్యక్తులు పరిచయం అయ్యారు. వారు తమను తాము విద్యావేత్తలుగా చెప్పుకొన్నారు. వ్యాసాలను ప్రచురిస్తామని నమ్మించి రక్షణ అంశాలపై వ్యాసాలు రాయించారు. ఎటువంటి అనుమానం రాకుండా ఉండేందుకు మొదట పర్యావరణం, భౌగోళిక రాజకీయాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రాయిస్తూ.. క్రమంగా రక్షణ రంగానికి సంబంధించిన విషయాల వైపు మళ్లించారు. ఈ విషయం తెలియని మహిళ వారిని నిజమైన విద్యావేత్తలుగా నమ్మి.. వారి ఉచ్చులో పడిపోయింది. రక్షణ, ఆయుధ వ్యవస్థలపై వ్యాసాలతో పాటు కీలక సైనిక స్థావరాల ఫోటోలు, వీడియోలు వాటిలో పొందుపరిచింది. రక్షణ రంగానికి సంబంధించిన వివరాలను కూడా ఆమె వారికి చేరవేసిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

## భారత్ విషయంలో ఆ రోజు హద్దులు దాటి మాట్లాడాను: జేడీ వాన్స్

కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని కంపెనీలను పర్మ్ (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. "భారత్ విషయంలో ఆ రోజు నేను హద్దులు దాటి మాట్లాడాను. 'విదేశీ ఒప్పంద పనివాళ్లు' అని నేను వాడిన పదం సరైనది కాదు. ఎ-1దీ వీసాదారులను లక్ష్యంగా చేసుకోవాలనేది నా ఉద్దేశం కాదు" అని స్పష్టత ఇచ్చారు. "ఆ రోజున అమెరికా కంపెనీలు, వీసా వ్యవస్థ గురించి మాట్లాడాలనుకున్నాను. ఉద్యోగులు అమెరికాకు హెచ్ 1బీ వీసాపై వస్తారు. వారిని తీసుకున్న కంపెనీలు ఆ పనికి ప్రత్యామ్నాయ అమెరికన్ కార్మికుడు దొరకలేదని అంటున్నాయి. దీంతో స్థానికులకు అవకాశాలు దక్కడం లేదు. దేశంలో తరచుగా ఇదే జరుగుతోంది. అందుకే ఆ విధంగా మాట్లాడాల్సి వచ్చింది" అని వాన్స్ పేర్కొన్నారు.

**నాడు వాన్స్ ఏమన్నారంటే..?**

హెచ్ 1బీ వీసాలపై నియమించుకునే విదేశీ ఉద్యోగులను 'విదేశీ ఒప్పంద పనివాళ్లు'గా, ఆ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకునే కంపెనీలను 'వీసా మిల్లులు'గా వాన్స్ అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం తెలిపింది. నిపుణుల తరలింపుతో భారతీయులకు అవకాశాలు కల్పించడంతో పాటు అమెరికా కంపెనీల సంపదను కూడా పెంచుతోందని పేర్కొంది. ఆవిష్కరణలు, పరిశోధన, ఉత్పాదకత, పోటీతత్వం, ఉద్యోగకల్పన వంటి విషయాల్లో కంపెనీలకు అత్యాధునిక ప్రతిభ ఎంతో సహాయకారిగా ఉందని వ్యాఖ్యానించింది. ఈ విషయంపై వాన్స్ అనవసరంగా మాట్లాడారని అభిప్రాయపడింది.

# ఎల్ నినో కాలంలో ప్రతి ఒక్కరు పొదుపు పాటించండి... ప్రభుత్వానికి సహకరించండి

- మొదటి పేజి తరువాయి

ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందులు తప్పవని... ప్రతి ఒక్కరు త్రాగు, సాగునీరుతో పాటు విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని అన్నారు మంత్రి వివేక్. ప్రకృతి విధ్వంసాలను కూడా ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం విడ్డూరమని అన్నారు. ఎల్ నినో ప్రభావం తో నేను కూడా నీటిని పొదుపు గా వాడుకుంటున్నానని...విద్యుత్ ను కూడా ఆదా చేస్తున్నానని అన్నారు మంత్రి వివేక్. ఎల్ నినో నేపథ్యంలో ప్రతిఒక్కరు పొదుపును పాటించాలని... ప్రభుత్వానికి సహకరించాలని అన్నారు మంత్రి వివేక్.కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికే చెక్కుచెదరలేదని... బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్లతో కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టు కుంగిందని అన్నారు. నాణ్యత లోపం,అవకతవకలే కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు మంత్రి వివేక్. మేడిగడ్డ పంపులు ఆన్ చేయాలంటున్న కేటీఆర్ బ్యారేజ్ ఎందుకు నిర్మించారు ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు మంత్రి వివేక్. ప్రాణహిత చేవెళ్ల నిర్మిస్తే తాగు సాగునీరుకి ఇబ్బందులు ఉండకపోతుండేనని అన్నారు.

తెలంగాణ ఏర్పడక ముందు 20 ఎకరాల భూమి ఉంటే పదేళ్లలో 300 ఎకరాలు అక్రమంగా ఎలా సంపాదించుకున్నారని ప్రశ్నించారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం వేలకోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి సంపాదించారని అన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి 50 కోట్ల ప్రజా ధనంతో ప్రత్యేక కాలువలతో కేసీఆర్ తన ఫామ్ హౌస్ కు నీళ్లను తెప్పించుకున్నారని అన్నారు.2016కు ముందు కేసీఆర్ ఫామ్ హౌస్ ఎదురుగా చెరువే లేదని...కానీ 58 ఎకరాలలో పాండురంగ చెరువును తవ్వించి మోటార్ల

ద్వారా ఫాం హౌస్ నుండి పంట పొలాలకు నీళ్లను మళ్లించుకున్నారని అన్నారు. ఇందులో 50 కోట్ల ప్రజాధనం తన సొంతానికి వాడుకున్నాడని... ఏకంగా మూడు ఎకరాల బావిని తవ్వి తన భూములనే బంగారంగా మార్చుకొని తెలంగాణ ప్రజల నోట్లో మట్టి కొట్టాడని అన్నారు మంత్రి వివేక్.వంద కేసులు ఉన్న బాల్క సుమన్ కు వంద కోట్లు ఎలా వచ్చాయని.. గత అసెంబ్లీ ఎన్నికల్లో 70 కోట్లను ఖర్చు చేశాడని అన్నారు. బాల్క సుమన్ అఫిడఫిట్ ను ప్రజలు గమనించాలని అన్నారు మంత్రి వివేక్.

## గునీటి వృథా.. హైదరాబాద్‌లో పబ్‌కు రూ.20వేల జరిమానా

హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టే దిశగా జలమండలి కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ పబ్‌పై భారీ జరిమానా విధించడంతో పాటు, నీటి కనెక్షన్‌ను తొలగించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. నీటి వృథా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ చర్యల ద్వారా స్పష్టం చేసింది.జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఉన్న 'ఫోర్ ఫాదర్స్ పబ్' తాగునీటిని విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన విజిలెన్స్ అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పబ్‌లో నీటిని వృథా చేస్తున్నట్లు తనిఖీల్లో నిర్ధారణ కావడంతో, యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా, ఆ పబ్ తాగునీటి కనెక్షన్‌ను శాశ్వతంగా తొలగించారు. అంతేకాక, జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి కమర్షియల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను కూడా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

**వేసవి దృష్ట్యా కఠిన చర్యలు.. ప్రజలకు విజ్ఞప్తి**

వచ్చే ఏడాది వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకే ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు జలమండలి స్పష్టం చేసింది. ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు వంటి వాణిజ్య సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వృథాకు పాల్పడితే ఇలాంటి చర్యలే కొనసాగుతాయని హెచ్చరించింది.

నీటి సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని జలమండలి కోరింది. ఎక్కడైనా తాగునీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, ఫొటోలు లేదా వీడియోలతో సహా పూర్తి వివరాలను వాట్సాప్ నంబర్ 99499 30003కు పంపాలని సూచించింది. లేదా కస్టమర్ కేర్ నంబర్ 155313కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.

## ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు: టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు.బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు

దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.ఈ మోసానికి పాల్పడిన టోమ్‌కామ్, ఫెయిర్‌ట్రేట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

## ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు.. 143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు

ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఆందోళనల్లో భాగంగా 143 ఏళ్ల నాటి చారిత్రక లిమోజెస్ టౌన్ హాల్ భవనానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో భవనం చాలా వరకు ధ్వంసమైంది.

ఈ భవనానికి 1873లో నిర్మాణం ప్రారంభం కాగా, 1883లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం ఫ్రాన్స్‌లో చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందింది. ముసుగులు ధరించిన కొందరు ఆందోళనకారులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మంటల కారణంగా భవనం పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట రెండొంతులు నాశనమైందని వెల్లడించారు. ఇది దేశ వారసత్వ సంపదకు జరిగిన ఘోర విపత్తు అని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు.

దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది మొదట శాంతియుతంగా ప్రదర్శనలు చేపట్టారు. అయితే, పారిస్‌తో పాటు మార్సెల్, లియోన్, లిల్లే వంటి నగరాల్లోనూ ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు లూటీలకు, దహనకాండలకు పాల్పడ్డారు.

ఈ ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మందిని అదుపులోకి తీసుకున్నామని, 150 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. ఈ హింసను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్రంగా ఖండించారు.ద

"మన గణతంత్రంలో హింసకు తావులేదు" అని ఆయన స్పష్టం చేశారు.ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నెలకొన్న అశాంతికి వలస విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. "వైవిధ్యం, కరుణ పేరుతో పాశ్చాత్య ఉదారవాదులు మూడో ప్రపంచ దేశాలను ఫ్రాన్స్ వంటి దేశాల్లోకి దిగుమతి చేసుకున్నారు. కానీ, వారిని కలుపుకుపోవడం వంటి ప్రాథమిక ప్రశ్నలను విస్మరించారు" అని వ్యాఖ్యానించారు.

మరిన్ని చారిత్రక కట్టడాలు కాలిపోకముందే ఫ్రాన్స్ ఈ ఆందోళనలను ఆపాలని, అమెరికాలో కాంగ్రెస్ డెమొక్రాట్లు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనని ఆయన హెచ్చరించారు.

## బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా కాల్పులు

- మొదటి పేజి తరువాయి

తుపాకీతో వరుసగా కాల్పులు జరిపారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా బయటపడ్డారు. కారు డ్రైవర్‌తోపాటు ఓ ఆటో డ్రైవర్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై జుహూ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.ఈ ఘటనకు బాధ్యులు ఎవరు? ఎందుకు చేశారు? అన్న వివరాలు తెలియాల్సి ఉంది. అయితే.. ఈ కాల్పులకు తామే బాధ్యులమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిత్, హర్మన్ సంధు అనే గ్యాంగ్‌స్టర్ల పేరిట సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే విషయంలో తమ గ్యాంగ్ హెచ్చరికలను పట్టించుకోనందుకే టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు వారు పేర్కొన్నారని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముంబయి పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి కాల్పుల ఘటనపై వివరాలు ఆరా తీశారు. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీని ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. మరోవైపు.. నిందితుల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనను వివిధ కోణాల్లో దర్యాప్తు చేసేందుకు 15 బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## రష్యాపైకి 1,000కిపైగా డ్రోన్లు.. మంటల్లో ఇంధన టెర్మినల్

- మొదటి పేజి తరువాయి

మంటల్లో చిక్కుకుపోయింది. రష్యా చమురు మౌలిక సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకోవడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న తరుణంలోనే తాజా దాడులు జరగడం గమనార్హం. ఉక్రెయిన్ దాడుల్లో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. పీటర్స్‌బర్గ్ ఆయిల్ టెర్మినల్‌తోపాటు రూచి ఆయిల్ డిపోలో మంటలు చెలరేగాయని చెప్పారు. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగాయన్నారు. మొత్తం 1,015 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. మరోవైపు.. ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రంప్ 'ఇంధన కాల్పుల విరమణ' ప్రకటించిన వారం రోజుల్లోనే తమ ఇంధన, చమురు, గ్యాస్ సదుపాయాలపై రష్యా 76 సార్లు దాడులకు తెగబడిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. విద్యుత్ బ్లాక్‌అవుట్ సృష్టించేందుకు మాస్కో యత్నిస్తోందని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఆంక్షల సడలింపులు, ఒప్పందాలకు అనుగుణంగా రష్యా ఎటువంటి సానుకూల చర్యలు తీసుకోవడం లేదనే వాస్తవాన్ని అమెరికా గుర్తించాలన్నారు.

# సర్పంచ్ ఇంటి ముందే బురద రోడ్డు.. అమలుకు నోచుకోని అభివృద్ధి!







- అధికారుల కళ్లకు కనిపించడం లేదా? అమీనాబాద్‌లో అధ్వానంగా రహదారి!
- ఇదేనా అభివృద్ధి? బురదలో కూరుకుపోతున్న అమీనాబాద్!
- అమీనాబాద్‌లో రహదారి దుస్థితి.. తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**అనంతగిరి అక్టోబర్ 18 (ఆర్యాద్వి):** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో రహదారి దుస్థితి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామంలో స్థానిక సర్పంచ్ ఇంటి ముందున్న ప్రధాన రహదారే బురదమయంగా మారింది. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు, బురద పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు. పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంది. సర్పంచ్ ఇంటి ముందే రోడ్డు పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, గ్రామంలోని ఇతర వీధుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# ఆ దుర్గా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

## దేవీ నవరాత్రుల్లో భాగంగా మహా అన్నదానం





**అనంతగిరి, అక్టోబర్ 18 (ఆర్యాద్వి):** మండల పరిధిలోని వాయిల సింగవరం గ్రామంలో ఆదివారం రోజు అమ్మవారి సన్నిధిలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా 8 వ రోజు అమ్మవారు శ్రీ దుర్గా దేవి అవతారంలో అలంకరించి జంగిలి సతీష్‌ఉమా దంపతుల చే ప్రత్యేక పూజలు పూజారి సూర్యనారాయణ శర్మ నిర్వహించారు. అనంతరం యువశక్తి యుత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమానికి పలువురు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే యువశక్తి ఉత్సవ కమిటీ దేవీ నవరాత్రుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాల్లో గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శించుకుని కనకదుర్గమ్మ తల్లి ఆశీర్వాదాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిగామశ్రీనివాసులు అనంతగిరి మండలం మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వెంపటి వెంకటేశ్వరరావు, గుండ్లపల్లి వెంకన్న, వీరబోయిన నాగరాజు, కంటూ నాగేశ్వరరావు, బుర్ర నరేష్, బుర్ర పెద్ద గొల్ల వెంకన్న. బుర్ర పెద్ద గొల్ల సైదులు గడ్డం వీరబాబు, వీరబోయిన రాములు, బుర్ర వీరబాబు, దేవులపల్లి నరసింహారావు, గద్దె రఘు, గద్దె రామారావు బుర్ర పవన్ గ్రామ ప్రజలు యువత మహిళలు చిన్నారులు దుర్గ మాల ధరించిన భక్తులు అయ్యప్ప భక్తులు యువ శక్తి యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# నాచారం రహదారికి రూ.44 కోట్లతో మహర్దశ

## నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 18:** ఏన్కూరు: రూ. 44 కోట్లతో నిర్మించే నాచారం రహదారి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అత్యంత క్లిష్టమైన ఆర్థిక శాఖను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు అందుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు.



ఈ కార్యక్రమం లో..: కలెక్టర్ దివాకర.టిఎస్, సిపి సునీల్ దత్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# పాలవరం తండాలో రోడ్ల పక్కన పిచ్చి మొక్కల తొలగింపు



**అనంతగిరి, అక్టోబర్ 18 (ఆర్యాద్వి):** మండల పరిధిలోని పాలవరం తండా గ్రామపంచాయతీ పరిధిలో రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లు, ముళ్ల పొదల తొలగింపు పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ భూక్యా నారాయణ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. రోడ్లపై రాకపోకలకు అడ్డంకిగా ఉన్న పిచ్చి మొక్కల వల్ల వాహనదారులకు, పాదచారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించి ఈ చర్య తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా నారాయణ మాట్లాడుతూ "రోడ్లకు ఇరువైపులా పిచ్చి చెట్లు, కంపలు ఏపుగా పెరిగి రహదారిని కప్పేస్తున్నాయి. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులకు దృష్టి అంతరాయం కలుగుతోంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ తొలగింపు పనులు చేపట్టాం" అని అన్నారు. రోడ్ల వెంబడి పెరిగిన ముళ్లపొదల వల్ల ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ తీసుకున్న ఈ చర్య పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# పూల జాతరగా మారిన పాలవరం బోరింగ్ బజార్

### ఘనంగా బతుకమ్మ వేడుకలు



**అనంతగిరి అక్టోబర్ 18 (ఆర్యాద్వి):** మండల పరిధిలోని పాలవరం గ్రామంలో ఆదివారం బోరింగ్ బజార్ లో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల సందర్భంగా బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలు పేర్చి, ఆటపాటలతో వేడుకలకు శోభ తెచ్చారు. సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ వలయాకారంగా నిలిచి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. బంతి, చేమంతి, గునుగు, తంగేడు వంటి తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలు వేడుకలకు మరింత సౌందర్యాన్ని తెచ్చాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళల ఉత్సాహాన్ని అభినందించారు.

# రాపర్తి నగర్ 2 వివేకానంద కాలనీలో బతుకమ్మ వేడుకల్లో..

## సందడి చేసిన "చిన్నారి సాయి హన్వి"





**ఖమ్మం నగరం: అక్టోబర్: 18:** సద్దుల బతుకమ్మలో మేము సైతం అంటూ చిన్నారి "సాయి హన్వి "ఎంగిలి బతుకమ్మ నుండి తొమ్మిది రోజుల పాటు సాగిన వీరి ఆటలు పాటలు తీరొక్క ముచ్చటగా ఉన్నాయి..నేడు సద్దుల బతుకమ్మ సందర్భంగా వారి ఇంటి నందు పూచిన తీరొక్క పువ్వులతో బతుకమ్మని పేర్చి ఆట పాటలకు బయలుదేరిన చిన్నారి పకృతి అందాలను పూల సౌందర్యాన్ని శ్రీ శక్తి స్ఫూర్తిని కలిపిన ఈ పండగలో "చిన్నారి హన్వి "మహిళలతో సమిష్టంగా బతకమని పేర్చిన పూలతో అలంకరించిన బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బుడిబుడి నడకలతో ఆడుతూ పాడుతూ అందరినీ ఆకట్టుకుంది ఇది కేవలం పూల పండగ మాత్రమే కాకుండా సమాజంలోని ఐక్యత సౌభ్రాతృత్వం స్త్రీల గౌరవాన్ని ప్రతిబింబించే వేడుకగా ఈ బతుకమ్మ నిలుస్తుంది సద్దుల బతుకమ్మ పండుగ 9వ రోజున తీరక్క పూలతో బతుకమ్మను పేర్చి ఘనంగా నిర్వహించారు.

## మాటేటి శ్రీ రామారావు దశదిన కర్మలో పాల్గొన్న మంత్రి తుమ్మల





**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 18:** ఖమ్మంలో మాటేటి రామారావు దశదినకర్మలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు ఆదివారం స్వర్గీయ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. లినమస్తే తెలంగాణ బ్యూరో ఇంచార్జ్ మాటేటి వేణు నాన్న రామారావు ఇటీవల స్వర్గస్తులైనారు మంత్రి తుమ్మల వెంట ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జిల్లా బ్యూరో ఇంచార్జ్ లు పాల్గొన్నారు

## ఎంపీ వద్దిరాజు కొత్తగూడెంలో పలు దుర్గామాత మండపాలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు



**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 18:** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం సాయంత్రం కొత్తగూడెంలో పలు దుర్గామాత మండపాలను సందర్శించారు,సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు హాజరయ్యారు.చుంచుపల్లి మండలం నంధా తండా,బంజారాకాలనీ,53వ డివిజన్ మేధర్ బస్తీ, పాల్వంచ 7వ డివిజన్ తదితర చోట్ల దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భాలలో ఎంపీ రవిచంద్ర వెంట కార్పొరేటర్లు గోవాడ గుణచరిత్,సింధూతపస్వి, బీఆర్ఎస్ నాయకులు భీమా శ్రీధర్,డిష్ నాయుడు,కన్ని రాజేష్, మహేష్ తదితరులు ఉన్నారు.ఎంపీ వద్దిరాజును శాలువాలతో సత్కరించారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణకే సొంతం..

ఎల్ నినో ప్రభావం తో రాష్ట్ర మొత్తం నీళ్ల కరువుతో అల్లాడిపోతుంటే సిద్దిపేట కోమటి చెరువు గోదావరి జలాలతో మత్తడి దూకుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్దిపేట కోమటి చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో హరీష్ రావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కోమటి చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో కలియతిరిగి ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కావడంతోనే సిద్దిపేటకు స్వచ్ఛమైన గోదావరి జలాలు వచ్చాయన్నారు. ఒకప్పుడు మురికి నీళ్లతో ఉండే చెరువు నేడు స్వచ్ఛమైన గోదావరి జలాలతో నిండుగా ఉందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ కే సొంతమన్నారు. తెలంగాణ బిడ్డలు మన సంస్కృతి, సంప్రదాయాలతో ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డగా ఈ బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. సిద్దిపేట కోమటి చెరువు ను అన్ని విధాలా అభివృద్ధి చేయడంతోనే ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య ఈ బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న రన్నారు.

## రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్న సర్పంచ్ కృష్ణ నాయక్

### బోటికింది తండా నుంచి మల్సూర్ దర్గా వరకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన





**నూతనకల్, అక్టోబర్ 18 ఆర్యాద్వి:** గ్రామంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు సర్పంచ్ గుగులోతు కృష్ణ నాయక్ తెలిపారు.ఆదివారం మండల పరిధిలోని బోటికింది తండా పీడబ్ల్యూ రోడ్డు నుంచి మల్సూర్ దర్గా వరకు గ్రామపంచాయతీ నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.దాదాపు 30 సంవత్సరాలుగా దర్గా అక్కడే ఉన్నప్పటికీ, రహదారి సౌకర్యం కల్పించడంపై గతంలో ఎవరూ దృష్టి సారించలేదని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్ గుగులోతు కృష్ణ నాయక్ చొరవతో దర్గా వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.అంతకుముందు తాళ్ల సింగారం నుంచి బోటికింది తండా వరకు రహదారి వెంట పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి రహదారిని శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## సర్వోత్తం రెడ్డి గెలుపు కోసం యువ కాంగ్రెస్ ప్రచారం.. కొత్తగూడెంలో హోరెత్తిన నినాదాలు

### కొత్తగూడెంలో సర్వోత్తం రెడ్డి ఎమ్మెల్సీ ప్రచారం ప్రారంభం



**అక్టోబర్ 18, అనంతగిరి(ఆర్యాద్వి):** ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపు కోసం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఓట్ల ప్రచారం, పట్టభద్రుల ఓటరు నమోదు కార్యమాన్ని ఆదివారం అనంతగిరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాగి నరేష్ అధ్యక్షత వహించారు.

రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తం పద్మావతి రెడ్డి, అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముసుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు యువ నాయకులు డైనమిక్ రామ్ రెడ్డి, సర్వోత్తం రెడ్డిని ఎమ్మెల్సీ ప్రచారం కార్యక్రమం నిర్వహించారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6 వరకు ఫారం--18 ద్వారా ఓటరు నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం గడువు విధించింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు మాట్లాడుతూ.. "పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కోసం ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలి అని. సర్వోత్తం రెడ్డి గెలుపు కోసం యువత, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంటేపులి వెంకటేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ అజీమ్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి నెల్లూరి వినయ్, గొండ్రియాల గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టిముక్కుల బాబురావు, కొత్తగూడెం సర్పంచి వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్లు వెంటనే విడుదల చేయాలి

### ఎన్నికల హామీలను అమలు జరపాలి : సీపీఎం

**కారేపల్లి, అక్టోబర్ 18:** చేయూత పథకం కింద అర్హులుగా గుర్తించిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు జరపాలని సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఆదివారం కారేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయలేదని విమర్శించారు. అనేక పర్యాలు దరఖాస్తులు స్వీకరించి, సర్వేలు నిర్వహించి, అర్హులను గుర్తించినప్పటికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయకుండా వాయిదా వేస్తున్నారని అన్నారు.

ఆగస్టు 15 నాటికి పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించి, అనంతరం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదంటూ దసరా పండగ వరకు వాయిదా వేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం చెప్పినట్లుగా దసరా పండుగ సందర్భంగా కొత్త పెన్షన్లు విడుదలవుతాయని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు.

ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ. 4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేసి, లబ్ధిదారులుగా ఎంపికైన వారికి ఈ దసరా పండుగ సందర్భంగా పెన్షన్ డబ్బులు విడుదల చేసి లబ్ధిదారులకు చేయూత అందించాలని, ఎన్నికల హామీలైన ఇందిరమ్మ ఇండ్లు, కళ్యాణ్ లక్ష్మి తులం బంగారం, భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరంకు రూ,, 12,000 మహిళలకు నెలకు రూ,,2500 విడుదల చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కొండబోయిన నాగేశ్వరరావు కోరారు.



జనరల్ న్యూస్
ఆర్యాద్వి
www.aryadvi.com

# "ఎర్రబోడులో" సద్దుల బతుకమ్మ సంబరాలు..








**కారేపల్లి అక్టోబర్ 18:** కారేపల్లి మండలం ఎర్రబోడులో 9వ రోజు ఘనంగా నిర్వహించారు సద్దుల ముద్దుల బతుకమ్మ వేడుకలను చూడ ముచ్చటగా జరుపుకున్నారు . మహిళలు , చిన్నారులు భక్తిశ్రద్ధలతో తెలంగాణ సాంప్రదాయాలతో ఉత్సాహంగా నిర్వహించారు . చప్పట్లు కోలాటాలతో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సందడిగా జరుపుకున్నారు అనంతరం ప్రసాద వితరణ , బతుకమ్మల నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి . ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు యువతి యువకులు గ్రామ పెద్దలు పాల్గొని బతుకమ్మ వేడుకను ఘనంగా జరుపుకున్నారు . ఈ కార్యక్రమంలో కారేపల్లి సొసైటీ మాజీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు ఎర్రబోడు సిపిఎం కార్యదర్శి కురసం శ్రీను, వజ్జ రామారావు

కడియాల రాజు అడప పుల్లారావు ఎర్రబోడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కడియాల సుధాకర్, ఉప సర్పంచ్ రమ మాజీ సర్పంచ్ కురసం సత్యనారాయణ, కృష్ణవేణి, పాకాలపాటి స్వరూప రాణి,బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు

# పులివెందుల స్థానిక పోరు.. జగన్‌కు బిగ్ టెస్టే..!



వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ భారీ ట్విస్టులతో ముడిపడిందనే చెప్పాలి. వైసీపీ తరఫున ఇప్పటికే మహిళ నాయకురాలు, జగన్ బంధువు టికెట్ సంపాదించుకున్నారు. నామినేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇక, టీడీపీ కూడా ఈ సీటును మహిళకు ఎంపిక చేశారు. దీంతో వైసిపి- టిడిపి మహిళా నాయకురాళ్ల మధ్య తీవ్రస్థాయిలో పోటీ అయితే ఉండనంది. ఇందులో ప్రధానంగా గమనించాల్సింది పులివెందుల మున్సిపాలిటీని దక్కించుకోవడం జగన్ కి ఇప్పుడు అత్యంత కీలకం.రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పరిస్థితి దారుణంగా ఉన్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంలో మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకోకపోతే అది మరింత ఇబ్బందికర పరిణామాలు సృష్టించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల పరిస్థితులను చూసుకుంటే ఇరుపక్షాల మధ్య కూడా దాడులు జరిగాయి. అలాగే మాటల తూటాలు.. వ్యూహ ప్రతివ్యూహాలు కూడా ఇరు పక్షాల మధ్య కామన్ గా మారిపోయింది. మహిళా నాయకులు పోటీలో ఉన్న నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందా.. లేకపోతే సర్దుబాటు అవుతాయా అనేది చూడాలి.

కానీ అటు వైసిపి ఈ ప్రాంతాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహంతో ముందుకు సాగుతూ ఉండడం గమనార్హం. అలాగే టిడిపి కూడా జగన్ నియోజకవర్గంలో తాము పాగా వేయాలని నిర్ణయించుకున్న క్రమంలో ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహాన్ని టిడిపి వైసిపిలు అనుసరిస్తున్నాయి. వైసీపీ తరఫున బరిలోకి దిగిన జగన్ చిన్నమ్మ వైయస్ ప్రమీల టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన తుగుట్ల గీతా కుమారి ఇద్దరు సీనియర్ నాయకులు కావడం గమనార్హం.

అంతేకాదు.. ఇరువురికి స్థానికంగా బలమైన ఫాలోయింగ్ ఉండడం వంటివి కీలకంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం టిడిపికి స్థానికంగా మద్దతు ఎక్కువ కనిపిస్తోంది. బీటెక్ రవి వ్యూహాలు అదేవిధంగా టిడిపి అధిష్టానం అనుసరిస్తున్న పద్ధతులు వంటివి ఈ నియోజకవర్గంలో ప్రభావం చూపించే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రమీలమ్మ రంగంలోకి దిగడంతో వైఎస్ ఫ్యామిలీ ప్రభావం కూడా ఉంటుందన్నది పరిశీలకులు అంటున్నారు. మరి ఏం జరుగుతుందని చూడాలి. ఏది ఏమైనా జగన్‌కు ఇది అత్యంత సవాలుగా మారనుందన్నది ఖాయం.

# ఏపీ లోకల్ వార్ ఇంకా ట్విస్టులు ఉన్నాయ్.. వీళ్లకు బిగ్ టెస్ట్... !



స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన శు క్రవారం నాడు రాయలసీమ జిల్లాల్లోని రాజంపేట పార్లమెంటు పరిధిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల్లో టిడిపి వైసిపి వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలు తారా స్థాయికి చేరాయి. కనీసం నామినేషన్ వేసే పరిస్థితి కూడా లేదన్న వాదన బలంగా వినిపించేలా చేసింది. దీనిపై పోలీసులు సీరియస్ గా స్పందించారు. తాజాగా 70 మందిపై కేసులు పెట్టారు. ఇంకా వందల మంది ఈ దాడుల్లో పాల్గొన్నారని భావిస్తూ.. వారి వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఈ ఘర్షణలు ఇక్కడితో ఆగిపోయినట్టేనా ఇక అంతా ప్రశాంతంగా జరుగుతుందా అంటే దీనికి సమాధానం లేదు. ఎందుకంటే ఇంకా బలమైన, వివాదాస్పదమైన నియోజకవర్గాలు చాలా ఉన్నాయి. వాటిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారుతున్నాయి. నువ్వా నేనా అన్నట్టుగా ఉన్న ఆయా నియోజకవర్గాల్లో మరిన్ని ట్విస్టులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. వీటిలో ప్రధానంగా తాడిపత్రి, ఆళ్లగడ్డ, కర్నూలు, ఒంగోలు, చీరాల, బాపట్ల ఇట్లా అనేకమైన సమస్యాత్మక ప్రాంతాలు కనిపిస్తున్నాయి.వీటిలో కూడా టిడిపి- వైసిపిల మధ్య చిరకాల ఘర్షణలు చోటు చేసుకుంటాయన్న అంచనాలు ఉన్నాయి. అలాగే మాచర్ల, గురజాల వంటి పల్నాడు ప్రాంతాల్లో సీట్లు కూడా హాట్ హాట్ గా ఉన్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని వైసిపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేయటం ఆంక్షలు విధించడం వంటివి ఉన్నప్పటికీ.. ఏ క్షణంలో ఏం జరుగుతుందని చెప్పడం కష్టంగా మారుతోంది. మరోవైపు టిడిపి నాయకులు కూడా ఏం జరిగినా ఫర్వాలేదు.. అనే రీతిలో నామినేషన్ కేంద్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొంది.దీనికి ప్రధానంగా దీర్ఘకాలంగా ఉన్న విభేదాలు, రాజకీయంగా జరుగుతున్న పరిణామాలు వంటివి కారణాలని పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఒకప్పుడు పరిమితమైన సమస్యలు ఇప్పుడు దాదాపు సగానికి పైగా నియోజకవర్గాలకు పాకడం ఆయా ప్రాంతాల్లో తీవ్రస్థాయి ఘర్షణలు చోటు చేసుకోవడం వంటివి చర్చనీయాంశంగా

ఉన్నాయి. ఇరుపక్షాల్లోనూ పట్టుదల, ఆగ్రహం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలాయించాలన్న ధోరణే కనిపిస్తోంది తప్ప ఎన్నికలను ప్రశాంతంగా ముందుకు తీసుకు వెళ్లాలన్న ఆలోచన కొరవడింది అన్నది వాస్తవం.దీనిని పరిష్కరించేందుకు ఇరుపక్షాలు సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. ముఖ్యంగా పులివెందుల, కుప్పం వంటి నియోజకవర్గాల్లో పరిస్థితులు మరింత దారుణంగా ఉండే అవకాశం ఉందని పోలీసులు ముందుగానే భావిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియను సవాల్‌గా తీసుకుంటున్నారు.

# నెల్లూరులో రూప్‌కుమార్‌కు లక్కు చిక్కేనా.. ?



నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఊహించని విధంగా టిడిపి అధినేత చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత ఎన్నికల తర్వాత టిడిపిలోకి వచ్చిన రూపు కుమార్ కు మేయర్ స్థానం అప్పగించారు. నిజానికి ప్రస్తుతం మంత్రిగా ఉన్న నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వంటి బలమైన నాయకులు చేసిన లాబీయింగ్ కూడా పక్కనపెట్టి చంద్రబాబు రూప్ కుమార్ కు అవకాశం కల్పించారు. ఇది ఒక రకంగా ఆయనకు లక్ అనే చెప్పాలి. అయితే, అసలు సమస్య ఇప్పుడే మొదలైంది. అంతర్గతంగా రూప్ కుమార్ చుట్టూ విభేదాలు ముసురుతున్నాయి.టీడీపీ కీలక నాయకులు ఆయన ఎంపికను తీవ్రంగా విభేదిస్తున్నారు. స్థానికంగా తీవ్ర ఆరోపణలు ఉన్న రూప్ కుమార్ కు టికెట్ ఇవ్వడం పట్ల సీనియర్ నాయకులు గుస్సాగా ఉన్నారు. ముఖ్యంగా మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సైతం రూప్ కుమార్ ఎంపికపై మౌనంగా ఉండిపోయారు. పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయం కావడంతో పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడడం ఇష్టం లేక వారు సైలెంట్ అయిపోయారు. కానీ, అంతర్గతంగా మాత్రం రూప్ కుమార్ ఎలా గెలుస్తాడో చూస్తామని ఒకరిద్దరు నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం.ఈ నేపథ్యంలో టికెట్ దక్కించుకున్నంత ఈజీగా రూప్ కుమార్‌కు గెలుపు సాధ్యం అవుతుందా అనేది ప్రశ్న. ముఖ్యంగా వైసిపి హయంలో రూపు కుమార్ వ్యవహరించిన తీరు, ఆయినపై వచ్చిన ఆరోపణలు వంటివి ఇప్పటికీ లైవ్ లోనే ఉన్నాయి. వాటిపై గతంలో టిడిపి సీనియర్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. అలాంటిది ఇప్పుడు రూప్ కుమార్ కి అవకాశం ఇవ్వడం పై వారంతా ఆగ్రహంతో ఉన్నారు. అయితే పైకి మాత్రం ఎవరూ మాట్లాడటం లేదు. ఇది ఎన్నికల ప్రచారంపైన, అదేవిధంగా గెలుపు పైన కూడా ప్రభావం చూపించే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.మరీ ముఖ్యంగా టిడిపి క్యాడర్లో రూప్ కుమార్ పై పెద్దగా పాజిటివ్ చర్చ అయితే నడవడం లేదు. ఆయనను ఇప్పటికీ వైసీపీ నుంచి వచ్చిన నాయకుడిగానే చూస్తున్నారు. గతంలో స్థానికంగా పదవులు నిర్వహించి ఉన్నప్పటికీ బలమైన కేడర్‌ను ఆయన సంపాదించుకోలేకపోయారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు స్వయానా బంధువు కావడం, ఆయన అనుచరులే ఈయనకి కూడా పనిచేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కూటమి పార్టీలను ఐక్యంగా చేయటం వారిని తనవైపు తిప్పుకోవటం అనేది రూప్ కుమార్ కు అత్యంత సంక్లిష్టమైన అంశంగా మారింది.నామినేషన్ వేయడం తేలికే కావచ్చు. కానీ, తీవ్రమైన పోటీలో గెలుపు గుర్రం ఎక్కడం అత్యంత ప్రధానమైన అంశం. దీనికి అన్ని వర్గాలు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. కానీ, ప్రస్తుతం ఆయన పరిస్థితిని గమనిస్తే మంత్రి నారాయణ సహా సీనియర్ నాయకులు అందరూ సైలెంట్ అయిపోవడం రూప్ కుమార్ పట్ల పెద్దగా సానుకూల ధోరణి వ్యక్తం చేయకపోవడం వంటివి పెద్ద సమస్యగా మారుతున్నాయి. దీంతో రూప్ కుమార్ ఏ మేరకు విజయం దక్కించుకుంటారనేది చూడాలి.

# మళ్లీ రంగంలోకి బాబు.. సమస్యలు సెట్‌రైట్.. !




టిడిపి అధినేత చంద్రబాబు మళ్ళీ రంగంలోకి దిగుతున్నారా? పార్టీ నాయకులు కార్యకర్తలతో ఆయన వరుస పెట్టి సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారా? అవసరమైతే జిల్లాల్లోనూ పర్యటించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా కూటమి పొత్తులో భాగంగా 20 స్థానాలకు పైగా మున్సిపల్ సీట్లను జనసేనకు కేటాయించారు. ఇది టిడిపి నాయకులు తప్పు పట్టకపోయినప్పటికీ తాము కోరుకున్న స్థానాలను లేదా తమకు బలంగా ఉన్న స్థానాలను జనసేనకు ఇవ్వడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తం అవుతోంది.సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏకంగా కన్నీరు పెట్టుకున్న ఉదంతాలు, అలాగే శ్రీకాకుళం లో మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం వంటివి పార్టీలో హైలెట్ గా మారాయి. ఇవి ఒకరకంగా చిన్నవే అయినప్పటికీ ఎన్నికల సమయానికి కూటమిపై ప్రభావం చూపించే అవకాశం ఉందని చంద్రబాబు భావిస్తున్నారు. టిడిపిలో ఎంపికల విషయంలో కూడా తమ్ముళ్లు అసంతృప్తితో ఉన్నారు. తాము కోరుకున్న వారికి లేదా తాము ఆశించిన వారికి అవకాశం కల్పించలేదని అధిష్టానం పై ఒకింత ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఇలా కొనసాగితే పార్టీకి నష్టం వస్తుందని భావిస్తున్న చంద్రబాబు.. నామినేషన్ల పర్వం పూర్తి కాగానే అంటే ఒకటి రెండు రోజుల్లోనే ఆయన పార్టీ నాయకులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. అదేవిధంగా తానే స్వయంగా అవసరమైతే జిల్లాల్లో పర్యటించాలని కూడా నిర్ణయించుకున్నారు. తద్వారా ప్రస్తుతం నెలకొన్న అసంసత్తులు, సమస్యలు పరిష్కారం అవుతాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా టిడిపి గెలుపు ఓటముల కంటే కూడా కూటమిగా ఉన్న జనసేన పార్టీపై ఎక్కువగా చంద్రబాబు దృష్టి పెడుతున్నారనే చెప్పాలి. 21 మున్సిపాలిటీ స్థానాలతో పాటు నాలుగు కార్పొరేషన్ స్థానాలను ఇచ్చిన నేపథ్యంలో వాటిలో ఆ పార్టీని గెలిపించుకోవడం ద్వారా కూటమిగా ఐక్యంగా ఉన్నామన్న సంకేతాలను బలంగా పంపించాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక చూస్తూ ఊరుకుంటే కుదరదని క్షేత్రస్థాయిలో ఏర్పడిన సమస్యలను తానే స్వయంగా పరిష్కరించాలని చంద్రబాబు నిర్ణయించుకున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు మంత్రులు.. జిల్లాల ఇన్చార్జి మంత్రులు కూడా స్థానికంగా ఉన్న క్యాడర్ కు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఈ సర్దుబాట్లు పెద్దగా ఫలించే అవకాశం కనిపించడం లేదని అంచనా వేస్తున్న నేపథ్యంలో కచ్చితంగా చంద్రబాబు రంగంలోకి దిగుతారని అంటున్నారు.

# ఆర్యాద్వి సంపాదకీయం Editorial




**ఏదైనా అనుకున్నంతనే జరిగిపోవాలి. నచ్చినోళ్లను ఎంచుకోవటం.. వారితో స్నేహం చేయటం.. మరింతముందుకు వెళ్లటం లాంటి వాటికి ఎంత టైం పడుతుందంటే..వారాలే కాదు ఒక్కోసారి నెలలు కూడా పడుతుంది. అదంతా పాత కాలం. ఇప్పుడు నడుస్తోంది జెన్ జీల యుగం. మారుతున్న కాలానికి తగ్గట్లుగా.. కొత్త ట్రెండ్ లను సెట్ చేసే క్రమంలో తెర మీదకు వస్తున్న తమాషా బంధాలకు తాజా నిదర్శనం ఈ స్పీడ్ ఫ్రెండింగ్ అలియాస్ ఇన్ స్టెంట్ ఫ్రెండింగ్. ఒంటరితనంతో ఉండాల్సిన అవసరం లేదు. మా ప్రోగ్రాంకు రండి.. అపరిచితులను కలవటం.. మీకు నచ్చినోళ్లను అప్పటికప్పుడు స్నేహం చేసుకునేలా వేదికలు హైదరాబాద్ మహానగరంలో ఈ మధ్యన కొత్త ట్రెండ్ గా మారింది.**

**ఐటీ కారిడార్ లో జోరు అందుకున్న ఈ తీరు చూస్తే.. అవాక్కు అవ్వాల్సిందే. సోషల్ మీడియాలో అపరిచిత స్నేహాలు సరిపోవన్నట్లుగా కొన్ని సంస్థలు నగరంలోని కొన్ని వేదికల మీద ప్రత్యేక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఎంట్రీ ఫీజ్ ను రూ.200 నుంచి రూ.వెయ్యి వరకు నిర్ణయిస్తున్నారు. ఆన్ లైన్ లో స్నేహాలు కుదుర్చుకొని.. కొంతకాలం చాటింగ్ చేసుకున్న తర్వాత కలిసే తీరుకు మరింత వేగంగా.. ఆ మాటకు వస్తే.. ఇన్ స్టెంట్ స్నేహాలకు వేదికలుగా ఈ వేడుకలు మారాయి.**

హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్.. గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో వీకెండ్ లో ఈ తరహా కార్యక్రమాలు ప్రత్యేకంగా సాగుతున్నాయి. ఇలాంటి వేదికల్ని పరిచయం చేయటానికి సోషల్ మీడియాను వినియోగిస్తున్నారు నిర్వహాకులు. తాజా స్పీడ్ ఫ్రెండింగ్ కాన్సెప్టు విషయానికి వస్తే.. ఇందులో ఎంట్రీ టికెట్ కొనుగోలు చేసి వచ్చేవారిలోని ప్రతి వ్యక్తితోనూ మూడు నుంచి ఐదు నిమిషాల వరకు సమయాన్ని కేటాయిస్తారు. సమయం ముగిసినంతనే టేబుల్ మీద ఉన్న వ్యక్తి మారి.. కొత్త వ్యక్తి వస్తారు. అలా అపరిచితులతో మాట్లాడుకోవటానికి వీలుగా.. మొహమాటం.. బిడియం లాంటివి పోగొట్టేందుకు ఈ తరహా వేదికలు పని చేస్తాయని చెబుతున్నారు. ఇలా మాటలతో పాటు.. ఆటలు.. ప్రశ్నలు ఇలా కొన్ని కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ఎంట్రీ ఫీజుకు అదనంగా ఫుడ్ బిల్ ఉంటుంది. మాటా మాటా కలిసి.. మనసుకు నచ్చితే అప్పటికప్పుడు ఆ అపరిచితులు కాస్తా పరిచయస్తుల మాదిరి.. స్నేహితులు మాదిరి మారిపోవచ్చు. అయితే.. ఈ తరహా వేదికల విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. ఎదుటి వ్యక్తి ఎవరు? వారి బ్యాక్ గ్రౌండ్ ఏంటి? వారు ఏ ఉద్దేశంతో వచ్చారు? వారేం కోరుకుంటున్నారు? కొత్త స్నేహాలతో సంతోషం తర్వాత.. అనుకోని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. స్నేహం అన్నది సహజంగా.. కాలంతో పాటు సాగాలే తప్పించి.. ఇన్ స్టెంట్ గా మొదలైతే.. ఆ తర్వాత అదో సమస్యగా మారే ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికి.. ఇలాంటి ట్రెండీ కాన్సెప్టులకు ఆదరణ అంతకంతకూ పెరుగుతున్నట్లుగా చెబుతున్నారు. కొత్త స్నేహాల కోసం డబ్బులు చెల్లించి మరీ వెళ్లాలా? అన్నదో ప్రశ్న. ఇలాంటి చోట్ల పరియమైన వారిని ఇట్టే నమ్మెయొద్దని.. వ్యక్తిగత వివరాల్ని ఎక్కువగా షేర్ చేసుకోవటం ఏ మాత్రం సురక్షితం కాదన్న హెచ్చరిక వినిపిస్తోంది. సో.. బీకేర్ ఫుల్.

---

**ప్రశాంతమైన జీవనానికి.. సంపన్న సంస్కృతికి కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తాయి యూరోపియన్ దేశాలు. చరిత్రలోకి వెళితే ఒకప్పుడు ప్రపంచాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని వందలాది దేశాల్ని శాసించటమే కాదు.. భారీ ఎత్తున సహజ వనరులను కొల్లగొట్టటం..తమ ఆధిక్యతను నిలుపుకోవటానికి కోట్లాది మంది ప్రాణాలను తీసేందుకు సైతం వెనుకాడని చరిత్ర యూరోప్ సొంతం. దాదాపు 500 ఏళ్లు ఐరోపా ఖండానికి చెందిన బ్రిటన్.. ఫ్రాన్స్.. పోర్చుగల్.. డచ్.. బెల్జియం..దేశాలు ప్రపంచంలోని పలు దేశాల్ని వలసవాదంతో పాలించాయి. వారి సహజవనరుల్ని కొల్లగొట్టాయి. భారతదేశంతో పాటు పలు ఆసియా దేశాల్ని.. ఆఫ్రికా ఖండంలోని దేశాలు మాత్రమే కాదు.. ఇప్పటి ప్రపంచానికి పెద్దన్న అమెరికాను సైతం యూరోపియన్ దేశాలే పాలించాయి.**

**ప్రపంచ దేశాల సంపదను.. వనరులను దోచుకోవటంలో ఏ మాత్రం మొహమాటం.. పాపభీతిని ప్రదర్శించని ఈ దేశాలు ఆర్థికంగా బలపడటమే కాదు.. సంపన్నంగా మారాయి. విలాసవంతమైన జీవనానికి తెర తీశాయి. వారి అధీనంలోని వలస రాజ్యాలు స్వాతంత్ర్యాన్ని సొంతం చేసుకోవటం.. ఏ దేశానికి ఆ దేశం తమ అస్తిత్వాన్ని చాటుకోవటంతో కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని ఏలిన ఆ దేశాలు ఇప్పుడు అశాంతికి చిహ్నాలుగా మారాయి. ఉపాధి కోసం.. పెరిగిన ధరలు.. విద్యా వ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలంటూ తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆయా దేశాలకు చెందిన పౌరులు రోడ్ల మీదకు వస్తున్నారు. సొంత ప్రభుత్వాల మీదే ఆందోళనలు చేస్తూ.. న్యాయం చేయాలంటూ ఉద్యమిస్తున్న వైనం ఇప్పుడు యూరోప్ లోని పలు దేశాల్లో కనిపిస్తోంది.**




ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తింపు ప్రకారం ఐరోపా ఖండంలో మొత్తం 44 దేశాలు ఉండగా.. యూరోపియన్ యూనియన్ లో మాత్రం 27 దేశాలు ఉన్నాయి. వారందరికి ఒకే కరెన్సీ (యూరో) చెలామణిలో ఉన్న సంగతి తెలిసిందే. యూరోప్ దేశాలకు భౌగోళిక సరిహద్దులుగా రష్యా.. టర్కీ.. కజకిస్తాన్.. జార్జియా.. అజర్ బైజాన్ లాంటి దేశాలు ఉన్నాయి. తాజాగా నిరసనలతో అట్టుడుగుతున్న దేశాలుగా ఫ్రాన్స్.. బెల్జియం.. పోర్చుగల్.. ఇటలీ.. గ్రీస్.. అల్బేనియా.. జర్మనీ దేశాల్లో నిరసనకారుల నిరసనలతో మండుతున్నాయి. అక్కడి ప్రభుత్వాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

ఫ్రాన్స్ విషయానికి వస్తే.. అక్కడి స్కూళ్లలో మౌలిక వసతుల కొరత.. టీచర్ల కొరతతో పాటు.. పెరిగిన జీవన వ్యయం.. ఇంధన ధరల పెంపునకు వ్యతిరేకంగా భారీ ఎత్తున ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. అక్టోబరు 17-18 తేదీల్లో జరిగిన నిరసనల్లో లక్షలాది మంది పాల్గొనటం గమనార్హం. పారిస్.. మార్సేయ్ లాంటి నగరాల్లోని ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు జరగటం గమనార్హం. బెల్జియం విషయానికి వస్తే..అక్కడి వర్సిటీ రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు.. విద్యారంగంలో బడ్జెట్కోతలు.. నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలపై అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. విద్యార్థుల నిరసనలతో రాజధాని బ్రస్సెల్స్ నగరం అట్టుడుతోంది. ఆందోళనకారులను అడ్డుకోవటం కోసం పోలీసుల లాఠీ ఛార్జ్ తో పాటు టియర్ గ్యాస్.. వాటర్ క్యానన్లను ప్రయోగించాల్సిన పరిస్థితి.

పోర్చుగల్ విషయానికి వస్తే తక్కువ వేతనాలు.. జీవన వ్యయాలు పెరగటంతో పాటు ఆ దేశంలోని ప్రధాన నగరాల్లో ఇంటి అద్దెలు భారీగా పెరగటంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇటలీలో పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా భారీ నిరసనలుచోటు చేసుకుంటున్నాయి. సామాజిక సంక్షేమ బడ్జెట్లను కాపాడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇక.. విద్యా సంస్కరణలు.. బడ్జెట్ కోతలు.. ఆర్థిక ఇబ్బందులపై గ్రీస్.. అల్బేనియా.. జర్మనీ దేశాల్లో నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనలు కొన్నిచోట్ల హింసాత్మక ఘటనలకు కారణంగా మారుతున్నాయి.ఎందుకిలా జరుగుతోంది? అన్న ప్రశ్నకు సమాధానం వెతికితే.. ఆసక్తికర అంశాలు తెర మీదకు వస్తాయి. డోమినో ఎఫెక్ట్ గా కొందరు విశ్లేషిస్తున్నారు. ఒక దేశంలో విజయవంతమైన పోరాటం.. దాని పక్కనే ఉన్న దేశంలోని ప్రజల్లో స్ఫూర్తిని నింపటంతో పాటు.. తెర వెనుక ఉన్న కొన్ని శక్తులు.. వ్యవస్థాగత లోపాలను ఎత్తి చూపుతూ ఆందోళనలకు తెర తీస్తున్నారు. దీంతో నిరసనలు పెరుగుతున్న దేశాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. చైన్ సిస్టం మాదిరిగా ఉన్న నిరసనలకు సోషల్ మీడియా (టిక్ టాక్.. టెలిగ్రామ్.. ఎక్స్.. యూట్యూబ్.. ఇన్ స్టా) కీలకంగా మారుతున్నాయి.

ఆందోళనకారులు.. నిరసనకారులు తమ వాదనల్ని వినిపించేందుకు ఈ వేదికల్ని ఆయుధాలుగా వినియోగిస్తున్నాయి. తమదైన నెరేటివ్ ను క్రియేట్ చేసి జనాల మీదకు వదులుతున్నాయి. ఒక దేశంలోని నిరసనలు.. మరో దేశంలోని ఆందోళనకారులకు స్ఫూర్తిగా మారుతున్నాయి. ఫ్రాన్స్ లో విద్యార్థులు.. కార్మికులు రోడ్ల మీదకు వచ్చి అక్కడి ప్రభుత్వానికి చెమటలు పట్టించిన విజువల్స్ నిమిషాల వ్యవధిలో ఆ దేశానికి దగ్గర్లోని బెల్జియం.. పోర్చుగల్ యూత్ కు చేరటం.. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనల బాట పట్టటమే అన్న భావన యువతలో వేగంగా పెరుగుతోంది. దీనికి తోడు ఐరోపా వ్యాప్తంగా ఉన్నకార్మిక సంఘాలు.. విద్యార్థి సంఘాలు డిజిటల్ గ్రూపుల ద్వారా కనెక్ట్ అవుతూ.. తమ నిరసనల వ్యూహాలను. .నినాదాలను మరో దేశానికి ఆందోళనలకు ముడి సరుకుగా అందిస్తున్నాయి.యూరోప్ లో జరుగుతున్న ఈ వరుస ఆందోళన వెనుక బయట శక్తులు కూడా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉక్రెయిన్ - రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ కు ఐరోపా దేశాలు మద్దతు ఇస్తున్నాయి.ం

దీనికి ప్రతీకారంగా రష్యా లాంటి దేశాల డిజిటల్ వేదికల్ని ఆయుధాలుగా మార్చుకొని ఆ దేశాల్లోని అంతర్గత సమస్యల మీద ఫోకస్ చేస్తున్నట్లుగా కొన్ని వాదనలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో నిరసనలను మరింత పెంచేలా ఫేక్ అకౌంట్లు.. బాట్లు కుప్పలుగా వెల్లువెత్తతూ.. సరికొత్త సవాళ్లను విసురుతున్నట్లుగా చెబుతున్నారు. దీంతో పాటు గడిచిన కొన్నేళ్లుగా మధ్యప్రాచ్యం.. ఆఫ్రికా దేశాల నుంచి వలసలు భారీ ఎత్తున పెరగాయి. దీంతో.. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు తగ్గాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ నిధులు వలసదారులకు వెళుతున్నాయన్న అసంతృప్తి అంతకంతకూ పెరిగి ఆగ్రహంగా మారినట్లుగా చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. ఒకప్పుడు ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో ఉంచుకొని వారిపై అధికారం చెలాయించారో.. ఇప్పుడు ఆయా దేశాలకు చెందిన వలసలు ఐరోపా దేశాల్లో కలకలాన్ని క్రియేట్ చేస్తున్న వైనం చూస్తే..కర్మ ఎవరిని వదిలి పెట్టదన్న భావన కలుగక మానదు. కాకపోతే కొన్ని దశాబ్దాల సమయం పట్టిందంతే.

## రచయితలకు ఆహ్వానం!

మీ ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వండి..

మీ రచనలు, కథలు, కవితలు, వ్యాసాలు, సామాజిక అంశాలపై మీ అభిప్రాయాలను ఆర్యాద్వి పత్రిక ద్వారా పాఠకులకు చేరవేయండి.

మీ రచనలకు మా వేదికపై ప్రత్యేక స్థానం కల్పిస్తాం.

ఆసక్తి ఉన్న రచయితలు తమ రచనలను మాకు పంపించండి




పంపాల్సిన చిరునామా:

వాట్సాప్ నంబర్: 9912456573

# వంటకాలు హెల్త్ & ఆరోగ్యం

## రుచికరమైన ఆహారం.. ఆరోగ్యకరమైన జీవనం

**ఈరోజే మొదలు పెట్టండి**

- రోజూ తాజా కూరగాయలు తినండి.
- ఆహారంలో పండ్లను చేర్చుకోండి.
- ఉప్పు, చక్కెర పరిమితంగా తీసుకోండి.
- వేయించిన పదార్థాలను తగ్గించండి.
- సమతుల ఆహారపు అలవాట్లు పెంపొందించుకోండి.

### రుచికరమైన ఆహారం.. ఆరోగ్యకరమైన జీవనం

**1. రోజువారీ ఆహారంలో కూరగాయల ప్రాముఖ్యత**

మన శరీరానికి ప్రతిరోజూ పోషకాలు అవసరం. కూరగాయలు, పండ్లు, ఆకుకూరల ద్వారా విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ లభిస్తాయి. సమతుల ఆహారం తీసుకోవడం ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**సమతుల ఆహారంలో ఇవి ఉండాలి:**

- ఆకుకూరలు -- ఐరన్, ఫోలేట్ వంటి పోషకాలు
- పప్పుధాన్యాలు -- ప్రోటీన్లు, ఫైబర్
- కూరగాయలు -- విటమిన్లు, ఖనిజాలు
- పండ్లు -- విటమిన్లు, సహజ పోషకాలు
- గింజలు, నట్స్ -- ఆరోగ్యకరమైన కొవ్వులు





### 2. ఆరోగ్యకరమైన అల్పాహారం

(Breakfast) ఎందుకు ముఖ్యం?

ఉదయం అల్పాహారం తీసుకోవడం శరీరానికి శక్తిని అందిస్తుంది. రోజువారీ పనులు చురుకుగా చేసుకోవడానికి తోడ్పడుతుంది. అల్పాహారంలో ప్రోటీన్లు, ఫైబర్, ఇతర పోషకాలు ఉండేలా చూసుకోవాలి.

**పోషకమైన అల్పాహార ఎంపికలు**

**ఇడ్లీ + సాంబార్**

- తేలికగా జీర్ణమవుతుంది.
- పప్పుల ద్వారా ప్రోటీన్లు లభిస్తాయి.

**ఓట్స్ ఉప్మా / గంజి**

- ఫైబర్‌ను అందిస్తుంది.
- జీర్ణక్రియకు తోడ్పడుతుంది.

**వెజిటబుల్ ఉప్మా / పోహా**

- కూరగాయలతో పోషకాలు అందుతాయి.
- ఉదయం శక్తిని అందించడంలో సహాయపడుతుంది.

**పండ్లు ం గింజలు**

- విటమిన్లు, ఖనిజాలు అందుతాయి.
- ఆరోగ్యకరమైన అల్పాహారంలో భాగంగా తీసుకోవచ్చు.

### 3. హెల్త్ టిప్స్ --చిన్న అలవాట్లు, పెద్ద ప్రయోజనాలు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఖరీదైన ఆహారమే అవసరం లేదు. ప్రతిరోజూ పాటించే చిన్న చిన్న అలవాట్లు కూడా మంచి ఫలితాలను అందిస్తాయి.

- రోజంతా తగినంత నీరు తాగండి.
- రోజువారీ ఆహారంలో కూరగాయలు, పండ్లు చేర్చుకోండి.

- ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడవడానికి ప్రయత్నించండి.
- రాత్రిపూట 7--9 గంటలు నిద్రపోండి.
- ఉదయం కొంత సమయం సూర్యరశ్మిలో గడపండి.
- పొగాకు, ధూమపానానికి దూరంగా ఉండండి.
- ధ్యానం, ప్రాణాయామం ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోండి.



- నడక: 30 నిమిషాలు
- యోగా: 15--20 నిమిషాలు
- స్ట్రెచింగ్: 10 నిమిషాలు
- బలాన్ని పెంచే వ్యాయామాలు: మీ సామర్థ్యానికి అనుగుణంగాప్రారంభంలో తక్కువ సమయంతో మొదలుపెట్టి, క్రమంగా వ్యాయామ సమయాన్ని పెంచుకోవాలి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలి.

### 4. వ్యాయామం -- ఆరోగ్యానికి బలం

నియమిత వ్యాయామం శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి, కండరాలను బలోపేతం చేయడానికి, శరీర బరువును నియంత్రించడానికి సహాయపడుతుంది. రోజూ చేయగలిగే సులభమైన వ్యాయామాలు



చిట్కా: వారానికి కనీసం 5 రోజులు వ్యాయామం చేయండి.

### 5. మంచి నిద్ర - ఆరోగ్యానికి రక్షణ

శరీరానికి విశ్రాంతి ఇవ్వడానికి నిద్ర చాలా ముఖ్యం. సరైన నిద్ర వల్ల ఏకాగ్రత మెరుగుపడుతుంది. శరీరం కోలుకోవడానికి, రోజువారీ పనులు ఉత్సాహంగా చేసుకోవడానికి సహాయపడుతుంది.

**మంచి నిద్ర కోసం పాటించాల్సినవి**

- ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవాలి.
- పెద్దలు సాధారణంగా 7--9 గంటలు నిద్రపోవాలి.
- పడుకునే ముందు మొబైల్ వినియోగాన్ని తగ్గించాలి.
- రాత్రిపూట అధిక కెఫీన్ ఉన్న పానీయాలను నివారించాలి.
- ప్రశాంతమైన, చీకటిగా ఉండే గదిలో నిద్రపోవాలి.



### ఆరోగ్యకరమైన జీవనానికి 7 బంగారు సూత్రాలు

1. సమతుల ఆహారం: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోండి.
2. తగినంత నీరు: రోజంతా నీరు తాగండి.
3. నిత్య వ్యాయామం: శారీరక చురుకుదనాన్ని పెంచుకోండి.
4. మానసిక ప్రశాంతత: యోగా, ధ్యానం అలవాటు చేసుకోండి.
5. సరైన నిద్ర: తగినంత విశ్రాంతి పొందండి.
6. చెడు అలవాట్లకు దూరం: పొగాకు, ధూమపానాన్ని నివారించండి.
7. సానుకూల ఆలోచనలు: ప్రశాంతంగా ఉండి, ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి.

ఆరోగ్యమే అసలైన ఆస్తి --- దానిని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంది.

తినండి ఆరోగ్యంగా... ఉండండి ఆనందంగా!



పాలక్ తివారీ పర్పుల్ డే లుక్ అందరినీ ఆకట్టుకుంది




**బాక్సాఫీస్ క్యాలెండర్ లో ఎప్పుడూ లేనంత క్రేజీ లైనప్ సిద్ధమవుతోంది. 2027లో టాలీవుడ్ నుంచి రాబోయే ఐదు భారీ పాన్ ఇండియా చిత్రాలు థియేటర్లను ఒక రేంజ్ లో షేక్ చేయబోతున్నాయి. ప్రభాస్ 'ఫౌజీ', మహేష్ బాబు 'వారణాసి', ఎన్టీఆర్ 'డ్రాగన్', మళ్లీ ప్రభాస్ 'స్పిరిట్', చివరగా అల్లు అర్జున్ 'రాకా'.. ఇలా టాప్ స్టార్లు వరుసపెట్టి తమ బాక్సాఫీస్ వేటను మొదలుపెట్టబోతున్నారు. ఒక్కో సినిమాకు మధ్య మంచి స్పేస్ దొరకడంతో, రికార్డుల ఊచకోత నాన్ స్టాప్ గా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.**

మొదటగా హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ' థియేటర్లలోకి రానుంది. ఈ ఏడాది డిసెంబర్ లో రావాల్సిన ఈ సినిమా షూటింగ్ పనులు ఆలస్యం కావడంతో సమ్మర్ స్టార్టింగ్ లోకి షిఫ్ట్ అయ్యింది. ఇక ఆ తరువాత సందడి ఏప్రిల్ 7 నాటికి పీక్స్ కు చేరుతుంది. ఆ రోజున ఎస్ఎస్ రాజమౌళి, మహేష్ బాబు కాంబోలో రాబోతున్న విజువల్ వండర్ 'వారణాసి' బాక్సాఫీస్ బరిలోకి దిగుతోంది. జక్కన్న మార్క్ గ్రాండియర్ తో మహేష్ గ్లోబల్ లెవెల్ లో చేయబోయే హంగామా బాక్సాఫీస్ ను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయం.

ఆ తర్వాత జూన్ 11న యంగ్ టైగర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ క్రేజీ ప్రాజెక్ట్ 'డ్రాగన్' బాక్సాఫీస్ పై దండయాత్ర చేయనుంది. రాజమౌళి సినిమా తర్వాత దొరికిన రెండు నెలల గ్యాప్ ఈ మాస్ ఎపిక్ కు పర్ఫెక్ట్ గా కుదిరింది. నీల్ మార్క్ ఎలివేషన్స్ కు తారక్ స్క్రీన్ ప్రెజెన్స్ తోడైతే థియేటర్లు దద్దరిల్లిపోవడం ఖాయం. మాస్ ఆడియన్స్ కు కావాల్సిన సాలిడ్ ట్రీట్ ను అందించేందుకు ఈ ప్రాజెక్ట్ సరైన టైమ్ లోనే దిగుతోంది.ఇక పండగ సీజన్ రాగానే అక్టోబర్ 29న సందీప్ రెడ్డి వంగా తన పవర్ ఫుల్ కాప్ డ్రామా 'స్పిరిట్'తో బాక్సాఫీస్ ను ఊపేయబోతున్నారు. రఫ్ పోలీస్ గా ప్రభాస్ స్వాగ్ దీపావళి బాక్సాఫీస్ కు అసలైన కిక్ ఇవ్వనుంది. ఇదే సమయంలో ప్రచారంలో ఉన్న 'రామాయణ' రెండో భాగం కూడా కాస్త వెనక్కి జరిగి మంచి డేట్ చూసుకుంటే ఇంకా బెటర్. అప్పుడు స్పిరిట్ సోలోగా బాక్సాఫీస్ దగ్గర విధ్వంసం సృష్టించడానికి మరింత క్లియర్ వే దొరుకుతుంది.

సంవత్సరం చివర్లో డిసెంబర్ కానుకగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'రాకా' థియేటర్లలోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. పుష్ప క్రేజ్ తర్వాత బన్నీ చేస్తున్న ప్రాజెక్ట్ కావడం, దానికి అట్లీ మార్క్ కమర్షియల్ మాస్ ఎలిమెంట్స్ జత కావడంతో ఈ సినిమాపై అంచనాలు హై రేంజ్ లో ఉన్నాయి. ఇయర్ ఎండ్ సెలవులను పూర్తిగా క్యాష్ చేసుకుంటూ ఆ ఏడాదికి ఒక అదిరిపోయే ముగింపు ఇవ్వడానికి రాకా రెడీ అవుతోంది.ఈ ఐదు చిత్రాల రిలీజ్ ప్లానింగ్ చాలా క్లియర్ గా, హెల్తీ గ్యాప్ తో కనిపిస్తోంది. ఒకదాని తర్వాత ఒకటిగా పాన్ ఇండియా మార్కెట్ ను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్టులు బాక్సాఫీస్ లెక్కలను తిరగరాయడం ఖాయం. దాదాపు అన్ని సినిమాలకు 1000 కోట్లు కొట్టే స్టామినా ఉంది. సరైన ప్లానింగ్ తో ఒక్కొక్కరు థియేటర్లలోకి దిగితే, వచ్చే ఏడాది భారతీయ సినీ చరిత్రలోనే టాలీవుడ్ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించడం పక్కా.



## ఆరెంజ్ మూవీలోని ఒక్క సీన్ తీసుకొని సినిమా చేసిన యంగ్ డైరెక్టర్...

## సూపర్ హిట్ అయిందిగా..

తెలుగు సినిమా ఇండస్ట్రీ సక్సెస్ ఫుల్ గా ముందుకు దూసుకెళుతుంది. ప్రస్తుతం ఇండియా వైడ్ గా మన హీరోలకు ఉన్న క్రేజ్ నెక్స్ట్ లెవెల్ అనే చెప్పాలి. రామ్ చరణ్ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆరెంజ్' సినిమా ఆశించిన మేరకు విజయాన్ని సాధించలేదు. మగధీర తర్వాత వచ్చిన సినిమా కాబట్టి ఈ మూవీ మీద భారీ హైప్ ఉండటంతో ఈ మూవీ ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. మొత్తానికైతే ఈ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో బొమ్మరిల్లు భాస్కర్ మీద తీవ్రమైన విమర్శలైతే వచ్చాయి. అప్పట్లో ఈ సినిమా ఫ్లాప్ అయినప్పటికి ఇప్పుడు మాత్రం కల్ట్ క్లాసిక్ సినిమాగా చెబుతున్నారు. రీ రిలీజ్ చేసినప్పుడు ఈ సినిమాని చూడడానికి యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులంతా ఇంట్రెస్ట్ చూపించారు. మొదట మూవీ రిలీజ్ అయినప్పుడు ఆ టైమ్ లో ఉన్న ప్రేక్షకుల మైండ్సెట్ కి రీచ్ అవ్వలేదు. కానీ ఇప్పుడున్న జనరేషన్ కి ఈ సినిమా పర్ఫెక్ట్ గా మ్యాచ్ అయింది అంటూ చాలామంది సినీ విమర్శకులు సైతం కామెంట్లు చేయడం విశేషం...

### ఒక్క సీన్ తో సినిమానే వచ్చిందా

ఆరెంజ్ సినిమాలో ఫోన్స్ ఎక్స్చేంజ్ చేసుకోవడం మీద ఒక సీన్ ఉంటుంది. అప్పట్లో ఫోన్ యూజ్ ఎక్కువగా లేదు. కాబట్టి ఆ ఫోన్ ఇచ్చే సీన్ పెద్దగా ఎఫెక్టివ్ గా అనిపించలేదు. కానీ ఇప్పుడున్న జనాలు ఫోన్ కి ఎక్కువగా అడిక్ట్ అయిపోయారు. ఒకరి ఫోన్లో ఎన్నో సీక్రెట్ లు ఉంటాయి. ఫోన్స్ ఇవ్వడానికి ఎవ్వరు ఇష్టపడరు. అదే పాయింట్ మీద యంగ్ డైరెక్టర్ అయిన ప్రదీప్ రంగనాథన్ 'లవ్ టుడే' సినిమా చేశాడు. ఈ సినిమా సూపర్ సక్సెస్ అయింది. ఆ థాట్ ఈ జనరేషన్ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే విధంగా ఉండడంతో సినిమా సూపర్ సక్సెస్ అయింది.

ఆరెంజ్ సినిమా అప్పుడు ఆడక పోవడానికి కారణం అప్పుడు ఫోన్లు వాడే వాళ్ళ సంఖ్య తక్కువగా ఉంది. అలాగే ఆ సన్నివేశం ప్రేక్షకులకు పెద్దగా ఎఫెక్టివ్ గా అనిపించలేదు. ఒక సినిమా సక్సెస్ అవ్వాలంటే అప్పుడు ఉన్న పరిస్థితులను బట్టి అప్పుడున్న ప్రేక్షకుల మెంటాలిటీని బేస్ చేసుకొని అందరికీ కనెక్ట్ అయ్యే విధంగా సినిమాని తెరకెక్కించాలి. అడ్వాన్స్డ్ ఆలోచనలతో సినిమాని తీస్తే కొన్ని సందర్భాల్లో సక్సెస్ ని సాధించవచ్చు కానీ అప్పుడున్న ప్రేక్షకుల మైండ్ సెట్ ప్రకారం ఆ సినిమా ఎక్కువ మందికి రీచ్ అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి...



ప్రకృతి పావని శీర్ మెటాలిక్ గ్రే ఎన్‌సెంబుల్‌లో తలదాచుకుంది